### వచ్చే ఎన్నికల్లో మహిళలకు

# 33 శాతం రిజర్వేషన్లు తథ్యం



రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళల చిరకాల కోరిక మేరకు వచ్చే ఎన్నికల్లో 33 శాతం రాజకీయ రిజర్వేషన్లు అమలు కావడం తథ్యమని బిఆర్ఎస్ పార్లమెంటరీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందడంలో బిఆర్ఎస్ ప్రముఖ పాత్ర పోషించిందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, సునీతా లక్ష్మారెడ్డి, ఎంఎల్‌సి వాణీదేవి, మాజీ ఎంఎల్ఏ చంద్రావతి, కరీంనగర్ జడ్‌పి మాజీ ఛైర్ పర్సన్ తుల ఉమ, సీనియర్ నాయకురాళ్లు శ్రీదేవి,అరుణక్క తదితరులను వద్దిరాజు రవిచంద్ర శాలువాలతో సత్కరించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

**దేశాభివృద్ధిలో పురుషుడితో సమానంగా స్త్రీ భాగస్వామ్యం: బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బిఆర్ఎస్ అధినేత కెసిఆర్, మహిళాలోకానికి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు సామాజిక సంపద సృష్టికర్తలని, దేశాభివృద్ధిలో పురుషుడితో సమానంగా స్త్రీ భాగస్వామ్యం ఇమిడివున్నదని తెలిపారు. సంతానోత్పత్తి అనే అనివార్యమైన ధర్మాన్ని పాటించాల్సిన బాధ్యత స్త్రీకి ప్రకృతి కేటాయించిందని, మానవ మనుగడను కొనసాగించే ప్రత్యేక కర్తవ్యాన్ని అనేక కష్టాలతో నిర్వర్తిస్తున్న మహిళ త్యాగశీలి అని కెసిఆర్ కొనియాడారు.

### దోమల నివారణకు

# తక్షణ చర్యలు

హైదరాబాద్‌లో ప్రతి వారం డ్రైడే నిర్వహణ
హాట్ స్పాట్ ప్రాంతాల్లో ఫాగింగ్
జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/సిటీ బ్యూరో :** హైదరాబాద్ జిల్లాలో దోమల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్‌ను ఆదేశించారు. ఇటీవల జరిగిన హైదరాబాద్ జిల్లా 99రోజుల కార్యాచరణలో దోమల బెడదతోనే ప్రజలు తీవ్ర ఇబ్బందులు డుతున్నారన్న సమస్యనే జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ప్రధానంగా లేవనెత్తారని ఆయన చెప్పారు. దోమల సాంద్రను తగ్గించేలా ఎంటమాలజికల్ సర్వైలెన్స్‌ను బలోపేతం చేయాలని మంత్రి ఆదేశించారు.అధిక దోమల ప్రభావిత ప్రాంతాల్లో వంద శాతం జ్వరాల పర్యవేక్షణ చేయాలని తెలిపారు.డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గత మూడు సంవత్సరాల డేటా ఆధారంగా అధిక దోమల ప్రభావిత ప్రాంతాల్లో వచ్చిన వ్యాధులను వార్డులు, పిహెచ్‌సిల వారీగా సర్వేలు నిర్వహించాలన్నారు. గత సంవత్సర కాలంగా డెంగ్యూ, చికెన్ గున్యా కేసుల లైన్ లిస్టింగ్ చేసి ప్రధాన ప్రాంతాలైన పాఠశాలలు, నిర్మాణ స్థలాలు, నీటి నిల్వ ప్రాంతాలు, స్లమ్ ఏరియాలను గుర్తించి వార్డ్ వారీగా మైక్రోప్లాన్ సిద్ధం చేయాలన్నారు. ఫీల్డ్ సిబ్బందికి ఫాగింగ్ మరియు ఐఆర్‌ఎస్ షెడ్యూల్ నిర్వహించాలన్నారు. ప్రతి వారం డ్రై డే నిర్వహిస్తూ నీటి నిల్వలు తొలగించాలన్నారు. టెమోఫోస్ రసాయనాల వినియోగం, చేపల ద్వారా లార్వా నియంత్రణ, చెరువులు, కాలువల్లో ఆయిల్ బాల్స్ విడుదల, హాట్‌స్పాట్ ప్రాంతాల్లో ఫాగింగ్, నిర్మాణ స్థలాలు, ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల పరిశీలన చేయాలన్నారు. దోమల పెంపక స్థలాలను జియోట్యాగింగ్ చేయడం, లార్వా సాంద్రత మ్యాపింగ్ ద్వారా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. ప్రజలు తమ ఇండ్లలో, పరిసర ప్రాంతాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం దారా దోమల నియంత్రణలో ప్రజలకు సహకరించాలన్నారు.

### మహిళల సమస్యలు

# ఇప్పటికీ తీరలేదు

సిపిఐ వ్యాఖ్య




**న్యూఢిల్లీ:** ప్రపంచ వ్యాప్తంగా ఏ దేశంలోనూ మహిళా హక్కులు సంపూర్ణంగా అమలవుతున్న దాఖలాలు లేవని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) వ్యాఖ్యానించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో, హక్కుల కోసం మహిళలు చేసిన పోరాటాన్ని గుర్తుచేసుకుంది. సామ్యవాద ఉద్యమంతోపాటు మహిళలు చేసిన ఉద్యమాల కారణంగానే చారిత్రాత్మక దినంగా మార్చి 8 అవతరించిందని పేర్కొంది. మహిళలపై జరుగుతున్న దోపిడీ, అసమానతలు, రాజకీయ హక్కుల నిరాకణ వంటి సమస్యలపై పోరాడాలంటూ 1910లో, విప్లవ యోధురాలు క్లారా జెట్కిన్ ప్రపంచ వ్యాప్తంగా మహిళలకు పిలుపునిచ్చిన విషయాన్ని పార్టీ ప్రస్తావించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకొంటున్నప్పటికీ, పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, హింస, కుల వివక్ష, పితృస్వామ్యం వంటి ఎన్నో సమస్యలతో, దేశంలోని మహిళలు ఇప్పటికీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఐ తన ప్రకటనలో పేర్కొంది. మహిళల పట్ల అసమానతలను, వివక్షను, అణచివేతను పూర్తిగా నిర్మూలించామని ప్రకటించుకోగల స్థితిలో ఏ ఒక్క దేశం కూడా లేదని వ్యాఖ్యానించింది. ప్రతికూల పరిస్థితుల్లోనూ ధైర్యంతో, అకుంఠిత దీక్షతో ముందుకు వెళుతున్న మహిళలకు జేజేలు పలుకుతున్నట్టు తెలిపింది. సమానత్వం, గౌరవం, దోపిడీ రహిత, వివక్ష లేని సమాజ నిర్మాణానికి కట్టుబడి ఉన్నట్టు పార్టీ పునరుద్ఘాటించింది.



## కామ్రేడ్ దుర్గన్న సేవలు మర్చిపోలేనివి

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు యూసఫ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మేడ్చల్ మల్కాజిగిరి దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు, సిపిఐ కుత్బుల్లాపూర్ మండల మాజీ సహాయ కార్యదర్శి కామ్రేడ్ దుర్గన్న సంతాప సభ ఆదివారం జగద్గిరిగుట్ట సిపిఐ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ జాతీయ సమితి సభ్యుడు యూసఫ్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి మారుపాక అనిల్ లు పాల్గొని మాట్లాడుతూ తండ్రి సాయిలు పట్టిన జండాను వారసత్వాన్ని పునికిపుచ్చుకుని ఎర్ర జండాను పట్టుకొని పేద ప్రజల కోసం పనిచేస్తూ వారికి తగిన సహాయ సహకారాలు అందించే వారన్నారు. ఎప్పుడు ఎవరు ఏమి అడిగినా కాదనే వ్యక్తి దుర్గన్న అని అన్నారు. భౌతికంగా తను లేకున్నా అన్ని ప్రాంతలో తను గుర్తుండిపోతారని తెలిపారు. దుర్గయ్య చేసిన సేవలను అందరు కొనసాగించాలని, అదే ఆయనకు మనం ఇచ్చే నివాళులు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఏసు రత్నం, మండల కార్యదర్శి స్వామి, తెలంగాణ సాంస్కృతిక సలహా మండలి సభ్యులు దరువు అంజన్న, రచయిత మోహన్ బైరాగి, ఎన్ఎస్‌యుఐ నాయకులు సాయి, ఎఐటియుసి కార్యదర్శి శ్రీనివాస్, ప్రజానాట్యమండలి అధ్యక్షులు ప్రవీణ్, బాబు, భాస్కర చారి సహాయ కార్యదర్శి రాములు,సిపిఐ నాయకులు నర్సయ్య, నర్సింహా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అందరూ మహిళలను తక్కువ చేసే వారే

కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళలు ఏ ఇంట్లో పుట్టినప్పటికీ వారిపైన వివక్ష ఉంటుందని, భర్త, తండ్రి, అన్నఇలా అందరూ మహిళలను తక్కువ చేసే వారేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. వయసుతో సంబంధం లేకుండా మహిళలంతా రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళతో కలిసి కల్వకుంట్ల కవిత కేక్ కట్ చేశారు. 'గివ్ హర్ స్పేస్' పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. అనంతరం కవిత మాట్లాడుతూ 'స్టాండ్ విత్ హర్' అనే ప్రొగ్రామ్‌తో ముఖ్యమంత్రి మహిళలను అవమానించారని, మగవాళ్లు ఉంటేనే మహిళలు ముందుకు వెళ్తారనే విధంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడాన్ని ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలపై క్రైమ్ రేటు 22 శాతానికి పెరిగిందన్నారు. ఆడవాళ్ల భద్రత ప్రభుత్వ బాధ్యత అని, బిక్ష కాదని అన్నారు. ఆడవాళ్లు ఎక్సర్ సైజ్, ఎడ్యుకేషన్, ఎంప్లాయి మెంట్ అనే మూడు 'ఇ' లను ఫాలో అవ్వాలని సూచించారు. మహిళలు లేకుండా తెలంగాణ ఉద్యమమే లేదని, సామాజిక తెలంగాణ సాధనలో మహిళలే కీలకమని చెప్పారు. ఆధిపత్యం ఏ రూపంలో ఉన్నప్పటికీ మహిళలు సహించొద్దని, సామాజిక, పురుషాధిక్యతను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించే ప్రసక్తే ఉండొదని సూచించారు. మహిళలకు రాజకీయ పార్టీలు అవకాశం ఇవ్వడం లేదన్నారు. జాగృతిలో మాత్రం మహిళలకు చాలా పెద్ద ఎత్తున అవకాశాలు ఇవ్వబోతున్నామని కవిత తెలిపారు.

### జాతీయ పరిసర వాయు నాణ్యత ప్రమాణాలు-2009

# అత్యవసరంగా సమీక్షించి అప్‌గ్రేడ్ చేయాలి

కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరాం రమేష్ డిమాండ్
ప్రధాని మోదీపై విమర్శనాస్త్రాలు

**న్యూఢిల్లీ :** నానాటికీ కాలుష్య స్థాయిల తీవ్రతపై కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తంచేసింది. జాతీయ పరిసర వాయు నాణ్యత ప్రమాణాలు 2009ని అత్యవసరంగా సమీక్షించి అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్‌చేసింది. వాటిని ప్రతీచోటా సమర్థవంతంగా అమలు చేయడం సహా పర్యవేక్షించాలని నొక్కిచెప్పింది. కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి ఇన్‌చార్జి ఇన్‌కమ్యూని కేషన్స్ జైరాం రమేష్ ఆదివారం తన 'ఎక్స్' పోస్ట్‌లో ఈ సమస్యపై స్పందించారు. ప్రధానమంత్రి (పిఎం) నరేంద్రమోదీని విమర్శల దాడితో తూర్పార బట్టారు. పిఎం 56 అంగుళాల ప్రదర్శితమైంది. కానీ అది వాస్తవానికి పిఎం 2.5 మాత్రమేనని జైరాం రమేష్ ఎద్దేవా చేశారు. నేషనల్ క్లియర్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌సిఎపి)కి పిఎం 2.5పై లేజర్‌లాంటి దృష్టి అవసరమని జైరాం రమేష్ చెప్పారు. పిఎం 2.5 అంటే క్యూబిక్ మీటర్‌కు మైక్రోగ్రాములలో 2.5 మైక్రో మీటర్ల కంటే తక్కువ లేదా అంతకంటే వ్యాసం కలిగిన కణపదార్థం దేశంలో తీవ్రమైన పర్యావరణప్రజారోగ్య సంక్షోభానికి కారణంగా ఉద్భవించింది అని మాజీ పర్యావరణ శాఖ మంత్రి అయిన జైరాం రమేష్ తన 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 2009–2019 మధ్య కాలంలో 655 జిల్లాల నుంచి వచ్చిన డేటా ఆధారంగా 2024 డిసెంబర్‌లో ది లాన్సెట్ ప్లానెటరీ హెల్త్‌లో ప్రచురితమైన ఒక అధ్య యనం పిఎం 2.5 సాంద్రతలో క్యూబిక్ మీటర్‌కు ప్రతీ 10 మైక్రోగ్రామ్ పెరుగుదల మరణాలలో 8.6శాతం పెరుగుదలకు దారితీస్తోందని కనుగొన్నట్లు జైరాం రమేష్ ఎత్తిచూపారు. 2025 లాన్సెట్ కౌంట్ డౌన్ అంచనా ప్రకారం ప్రతీ యేటా 17.2లక్షల మంది భారతీయులు పిఎం 2.5కి గురికావడం వల్ల మరణిస్తున్నారది 38శాతం పెరుగుదల అని ఆయన చెప్పారు. పర్యావరణ, అడవులు, వాతావరణ మంత్రిత్వ శాఖ 2024, 2025 సంవత్సరాలలో పార్లమెంట్‌లో పదేపదే మాట్లాడుతూ వాయు కాలుష్యం పూర్తివివరాలను కచ్చితంగా స్థాపించలేమని అనడాన్ని జైఆరం రమేష్ గుర్తుచేశారు. కానీ ఇంతలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్), ఆరోగ్య మంత్రిత్వ శాఖ సొంత పరిశోధనా సంస్థ లాన్సెట్ ఫైండింగ్స్‌ను ఆమోదించింది. 2017లో 12.4లక్షల మరణాలు వాయు కాలుష్యం వల్ల సంభవించాయని, అయితే ఆ సంవత్సరం మొత్తం మరణాలలో 12.5శాతంగా ఉన్నాయని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరాం రమేష్ పేర్కొన్నారు.



## 30, 31న ఒబిసి జాతీయ సెమినార్లు

రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

**ప్రజాపక్షం/సోమాజిగూడ :** పార్లమెంట్‌లో బిసి బిల్లు ఆమోదించాలని, చట్టసభల్లో బిసిలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్‌చేస్తూ ఈ నెల 30, 31న ఢిల్లీలో ఒబిసి జాతీయ సెమినార్లు నిర్వహించనున్నట్టు జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బిసి ఐక్య వేదిక అధ్యక్షులు అనంతయ్య, సి.రాజేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి, మాట్లాడారు. కేంద్రంలో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసి. రూ.2లక్షల కోట్లతో ప్రత్యేక అభివృద్ధి పథకం ప్రకటించాలని డిమాండ్ చేశారు. బిసిల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను 25శాతం నుంచి 50శాతానికి పెంచాలని కోరారు. బిసి ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జిల నియామాకాలలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరారు. చలో ఢిల్లీ కార్యక్రమానికి ఎపి, తెలంగాణ, కర్ణాటక, ఒరిస్సా, మహారాష్ట్ర చెందిన కేంద్రమంత్రులు, ఎంపిలు, ప్రొఫెసర్లు, మేధావులు, ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పగిళ్ల సతీశ్, నేతలు నిఖిల్ పటేల్, శివకుమార్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# దళిత సమాజంపై విద్వేషాలను రెచ్చగొడుతున్న బిజెపి

కేంద్ర బడ్జెట్‌లో దళిత అభివృద్ధికి ప్రాధాన్యత లేదు
డి హెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ విమర్శ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశంలో దళితులపై జరుగుతున్న అన్యాయాలు, అణచివేతలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తీసుకుంటున్న విధానాలు దళిత సమాజంపై విద్వేషాలను మరింతగా రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ తీవ్రంగా విమర్శించారు. దళిత హక్కుల పోరాట సమితి రంగారెడ్డి జిల్లా రెండవ మహాసభ ఆదివారం దాసరి నారాయణ అధ్యక్షతన రాజేంద్రనగర్‌లోని దేవరాజ్ భవన్ జరిగింది. ఈ సమావేశానికి అతిథులుగా సిపిఐ రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగరావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు హాజరయ్యారు. మహాసభలను ప్రారంభిస్తూ మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల ప్రకటించిన కేంద్ర బడ్జెట్‌లో దళితుల అభివృద్ధి, సంక్షేమానికి సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడం బిజెపి ప్రభుత్వ అసలు వైఖరిని బయటపెడుతోందన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు విరుద్ధంగా, సామాజిక న్యాయం అనే మూల సూత్రాన్ని పక్కనబెట్టి బిజెపి ప్రభుత్వం దళితుల అభ్యున్నతిని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులను దళితుల అభివృద్ధి కోసం కేటాయించాల్సిన సమయంలో, ఆ నిధులను ఇతర కార్యక్రమాలకు మళ్లించడం దళితుల పట్ల జరుగుతున్న వ్యవస్థాపిత అన్యాయానికి నిదర్శనమని అన్నారు. విద్య, ఉపాధి, ఆరోగ్యం, గృహ నిర్మాణం వంటి కీలక రంగాల్లో దళితుల అభివృద్ధికి తగినంత నిధులు కేటాయించకపోవడం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని స్పష్టంగా చూపిస్తోందని పేర్కొన్నారు. దళితుల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులను పూర్తి స్థాయిలో దళితుల సంక్షేమ కార్యక్రమాలకే వినియోగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని మారుపాక అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. అలాగే సబ్ ప్లాన్ నిధుల కేటాయింపులు, ఖర్చులపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం సాధన కోసం దళితులు, ప్రజాస్వామ్యవాద శక్తులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో డి హెచ్ పి ఎస్ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి ,రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆరుట్ల రాజ్ కుమార్, టీ రామకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



## మహిళల హాకీ వరల్డ్ కప్ క్వాలిఫైయర్స్–2026 ప్రారంభం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ గచ్చిబౌలిలోని జిఎంసి బాలయోగి హాకీ స్టేడిఆయంలో లో నిర్వహిస్తున్న మహిళల హాకీ వరల్డ్ కప్ క్వాలిఫైయర్స్2026 టోర్నమెంట్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపి అనీల్ కుమార్ యాదవ్ తెలంగాణ ప్రభుత్వ క్రీడా సలహాదారు జితేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు. క్రీడా శాఖ అధికారులు, హాకీ సంఘం ప్రతినిధులు, క్రీడాకారులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ టోర్నమెంట్‌లో పలు దేశాల మహిళల హాకీ జట్లు పాల్గొంటుండటంతో హైదరాబాద్ అంతర్జాతీయ క్రీడా కేంద్రంగా మరింత గుర్తింపు పొందుతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రారంభ మ్యాచ్‌గా ఇండియా ఉమెన్స్ నేషనల్ ఫైల్డ్ హాకీ టీం, ఉరుగ్వే ఉమెన్స్ నేషనల్ ఫైల్డ్ హాకీ టీం జట్ల మధ్య జరిగిన పోరుతో టోర్నమెంట్‌కు శ్రీకారం చుట్టారు.



## రియల్ రంగం గణనీయంగా అభివృద్ధి

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వం తీసుకుంటున్న విప్లవాత్మకమైన నిర్ణయాల వల్ల రియల్ రంగం గణనీయంగా అభివృద్ధి చెందుతోందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార ,పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సచివాలయంలో ' ప్రాపర్టీ పల్స్' అనే ఆంగ్ల రియల్ ఎస్టేట్ వారంతపు పత్రికను మంత్రి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లను ఆకర్షించడంలో హైదరాబాద్ మిగతా నగరాల కంటే ముందంజలో ఉందన్నారు. తెలంగాణ నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త నిర్ణయాలను తీసుకుంటుందన్నారు. ఫ్యూచర్ సిటీతో హైదరాబాద్ కు అంతర్జాతీయ ఖ్యాతి నార్జించిందని, అనేక దేశ, విదేశీ సంస్థలు హైదరాబాద్‌లో పెట్టుబడులను పెట్టేందుకు ముందుకొస్తున్నాయని వివరించారు. . నగరానికే తలమానికమైన మెట్రో సెకండ్ ఫేజ్, రతన్ టాటా గ్రీన్ ఫీల్డ్ రోడ్డు ను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో 'ప్రాపర్టీ పల్స్' ఎడిటర్ కింగ్ జాన్సన్ కొయ్యడ,క్రెడాయ్ హైదరాబాద్ మాజీ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, పట్లోళ్ల కిరణ్, గొట్టేటి రాజేష్, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ సంయుక్త కార్యదర్శి చిలుకూరి హరిప్రసాద్, కార్యవర్గ సభ్యులు అమిత్ బట్టు, వనం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## బిసి కుల గణన చేపట్టాలని '23న చలో ఢిల్లీ'

జాజుల శ్రీనివాస్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఏప్రిల్ ఒకటో తేదీ నుండి దేశవ్యాప్తంగా ప్రారంభం కానున్న జాతి జనగణనలో బిసి కులగనన చేపట్టాలనీ, తెలంగాణ రాష్ట్రంలో చేసిన బిసి రిజర్వేషన్ల చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదించాలనే ప్రధాన డిమాండ్‌తో ఈనెల 23న బిసిల చలో ఢిల్లీ చేపట్టినట్లు బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఒక రోజు భారీ ధర్నా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. కొన్ని దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా సమగ్ర కులగలను చేపట్టాలని బిసిలు ఉద్యమాలు చేపడితే కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి, ఏప్రిల్ 30, 2025న జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో జాతీ జన గణనలో సమగ్ర కులగణన చేపడతామని ప్రకటించిందని ఆయన గుర్తు చేశారు. ఈ భారీ ధర్నాకు దేశంలోని 29 రాష్ట్రాల నుండి బిసిలు పెద్ద ఎత్తున కదిలి వచ్చి, విజయవంతం చేయాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు.



## సైబరాబాద్ ఇస్కాన్ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నల్లగండ్ల గోపన్‌పల్లిలో ఇస్కాన్ సైబరాబాద్ ఆలయ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ కార్యక్రమం వైభవం గా జరిగింది. ఈ కార్యక్రమం లో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇస్కాన్ నల్లగండ్లలోని గోపన్నపల్లి ప్రాంతములో ఉన్న శ్రీ రంగనాథ స్వామి ఆలయం ప్రక్కన గల 6000 గజాల భూమిని కేటాయించింది.ఈ కార్యక్రమం లో కొండా సురేఖ తో పాటు స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాజీ కార్పొరేటర్ గంగాధర్, తెలంగాణ ఎండోమెంట్స్ శాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ఇస్కాన్ అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భం గా మంత్రి సురేఖ మాట్లాడుతూ,నేటి కాలంలో యువతకు కేవలం డిగ్రీలు మాత్రమే కాకుండా నైపుణ్యాలు కూడా చాలా అవసరం అని, యువతకు సరైన దిశలో మార్గదర్శనం లభిస్తే వారు దేశ అభివృద్ధిలో గొప్ప పాత్ర పోషించగలరని అన్నారు. ఈ ఆలయం ద్వారా యువతకు వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, సంస్కృతి మరియు నైతిక విలువలు, వృత్తి నైపుణ్యాలపై శిక్షణ అందించే కార్యక్రమాలు నిర్వహించవచ్చునన్నారు. ఇస్కాన్ సైబరాబాద్ ఆలయం అధ్యక్షులు శ్రీ రామ్ దాస, ఇస్కాన్ మహారాజులు, ప్రభుజీలు, ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు భూమిపూజ కార్యక్రమం లో పాల్గొన్నారు.

### జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలపై

## సిఎం వ్యాఖ్యలు హర్షణీయం

జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం ప్రజాభవన్‌లో నిర్వహించిన మహిళా జర్నలిస్టుల సత్కార్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలో సానుభూతితో ఉన్నామని ప్రకటించడం హర్షణీయమని జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ఒక ప్రకటనలో పేర్కొంది. సుదీర్ఘ కాలంగా న్యాయ వివాదాల్లో చిక్కుకున్న అంశాన్ని సానుకూలంగా పరిష్కరించి భవిష్యత్తులో ఏ విధమైన న్యాయ, చట్టపరమైన సమస్యలు రాకుండా పరిష్కారం చేస్తామని సిఎం ప్రకటిచడంపై పట్ల సొటీ తరుపున ముఖ్యమంత్రికి రేవంత్‌రెడ్డికి ధనవ్యాదాలు తెలియజేస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు రవికాంత్ రెడ్డి, ఉపాధ్యక్షుడు నేమాని భాస్కర్, డైరెక్టర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. త్వరలోనే ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రకటించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే 75 మంది సొసైటీ సభ్యులు మరణించిన నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా స్థలాలు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ ఈగల్ టీమ్ భారీ ఆపరేషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:**ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా నగరంలో తెలంగాణ ఈగల్ టీమ్ భారీ ఆపరేషన్ చేపట్టింది. హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఆగ్రా డ్రగ్స్ డెన్‌ను గుర్తించింది. ఆదివారం పక్కా ప్రణాళికతో ఎటాక్ చేసింది. భారీ ఎత్తున మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకుంది. పది కెజిల మెఫిడ్రిన్, వెయ్యి లీటర్ల ముడిసరుకు సీజ్ చేసింది. ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి.. ఆగ్రా పోలీసులకు అప్పజెప్పింది. గంజాయి, డ్రగ్స్ రహిత తెలంగాణను తయారు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇక నుంచి రాష్ట్రంలో డ్రగ్స్ అమ్మినా.. కొనుగోలు చేసినా కఠినంగా శిక్షిస్తామని సీఎం రేవంత్ హెచ్చరించారు. నార్కోటిక్ బ్యూరోను ఇకపై 'ఈగల్'గా పిలుస్తామని.. ఎక్కడ గంజాయి కనిపించినా ఈ ఈగల్ పట్టుకుంటుందన్నారు. గంజాయిని గమనించినా.. డ్రగ్స్ ఆనవాళ్లను పరిశీలించినా.. క్షణంలోనే పట్టేస్తాయన్నారు. డ్రగ్స్ సరఫరాదారులపై, వినియోగదారులపై నిరంతరం నిఘా ఉంచుతామని ఇక నుంచి వారికి నిద్రలేని రాత్రులేనని అన్నారు. డ్రగ్స్ మహమ్మారిని రాష్ట్రం నుంచి సమూలంగా నిర్మూలిస్తామని స్పష్టం చేశారు. ఈగల్ వ్యవస్థ డ్రగ్స్ నెట్వర్క్‌ను పసిగట్టి.. వేగంగా చర్యలు తీసుకుంటుందని వివరించారు. సిఎం రేవంత్ రెడ్డి చెప్పిన విధంగానే.. ఈగల్ టీమ్ దేశమంతా జల్లెడ పడుతోంది. దేశంలోని ఏ మూలనుంచి డ్రగ్స్ వచ్చినా.. ఆ మూలకు వెళ్లి.. మూలాల నుంచే ప్రక్షాళన చేస్తోంది.

మల్కాజ్‌గిరి మునిసిపల్ కార్పొరేషన్
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, నాచారం సర్కిల్-8, ఎంఎంసి.
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు
NIT No. MMC/NC-8/E/3/2025-26 తేది: 07.03.2026
క్ర.సం. 1, NIT No. MMC/NC-8/E/3/2025-26,తేది: 07.03.2026, పని పేరు: 2 పనులు, ఎంఎంసి, నాచారం సర్కిల్-8లో రంజాన్ పనులు, విలువ: రూ.3,98,884, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 09.03.2026న మ.3.00గం.లకు, బిడ్ దాఖలుకు ఆఖరి తేది: 10.03.2026న మ.3.00ల వరకు, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 10.03.2026న మ.3.00గం.ల వరకు, ప్రైస్ బిడ్ ప్రారంభ తేది: 10.03.2026న మ.3.01 గం.లకు, కార్యాలయం పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, నాచారం సర్కిల్-8, ఎంఎంసి, ఇసిఐఎల్, హైదరాబాద్. సెల్ నెం. 8790374055. మరిన్ని వివరాలకు https://tender.telenagana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, నాచారం సర్కిల్-8, ఎంఎంసి.
DIPR R.O. No. : 16641-PP/CL/ADVT/1/2025-26, Date: 08-03-2026

## సిపిఐ కార్యాలయంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ప్రజాపక్షం / కూకట్‌పల్లి : అంతర్జాతీయ 115వ మహిళా దినోత్సవం సందర్భంగా కూకట్‌పల్లి మండలం శ్రీశ్రీ నగర్‌లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో ఆదివారం శ్రీశ్రీ నగర్ శాఖ కార్యదర్శి కె.మనోచారి అధ్యక్షతన అంతర్జాతీయ 115వ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి సిపిఐ మండల కార్యదర్శి జి.కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాల్లో స్వేచ్ఛ కలగాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సమాజంలోని అన్ని రంగాల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువాలతో సన్మానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా జి.ఉమారాణి, సరోజ, విమలబాయి, ఛాయాదేవి, జులేఖ తదితర మహిళా పార్టీ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కె.మనోచారి, గంగన్న, పెంటయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ ప్రతినిధులు బాధ్యతల స్వీకరణ



ప్రజాపక్షం/చర్లపల్లి : నూతనంగా ఎన్నికైన కాప్రా ప్రధాన పత్రికలు సీనియర్ జర్నలిస్టుల ప్రెస్ క్లబ్ ప్రతినిధులు ఆదివారం ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి బాధ్యతలు చేపట్టారు. అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతిర్మయచారి,ఆదిమూలం శ్రీనివాస్,కోశాధికారి వట్టిపల్లి సురేష్,ఉపాధ్యక్షులు పవన్,బాల్‌రెడ్డి,కార్యదర్శి రోజారాణి,కార్యనిర్వహక కార్యదర్శి బాల్‌రాజ్‌గౌడ్ బాధ్యతలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు కెసి మోహన్,చంద్రమౌళి,సత్యనారాయణ,కె రమేష్, సహదేవచారి,వి శ్రీనివాస్,బి విజయ్,ఆర్ నర్సింగ్‌గౌడ్,జి హరిప్రసాద్,నంబర్‌వన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రెస్ క్లబ్ కార్యాలయంలో కాప్రా ప్రధాన పత్రికలు,సీనియర్ జర్నలిస్టులు పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా వారు చేస్తున్న సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## విచ్చలవిడిగా అనుమతిలేని అక్రమ నిర్మాణాలు



ప్రజాపక్షం / కుత్బుల్లాపూర్ : దుండిగల్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు యధేచ్ఛగా కొనసాగుతున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు అందినకాడికి దండుకుంటూ అక్రమ నిర్మాణదారులకు సహకరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. పూర్తి స్థాయి టౌన్ ప్లానింగ్ అధికారులు ఉన్న అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడడంలేదు. గండిమైసమ్మ బిఆర్ఎస్ భవన్ పక్కన అనుమతులు లేకుండా రెండు షడ్లు నిర్మాణాలు జరుగుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపణలు వస్తున్నాయి. అదేవిధంగా బహదూర్‌పల్లి టెక్ మహేంద్రా ఎదురుగా భారీగా అక్రమ నిర్మాణం, పక్కనే మరో భారీ షెడ్, దుండిగల్ ఔటర్ రింగ్‌రోడ్ వద్ద భారీ షెడ్, గాగిల్లపూర్‌లో భారీ బహుళ అంతస్తుల భవనం పనులు జరుగుతున్న అధికారులు కన్నెత్తి చూడడంలేదు. ఇటీవలే దుండిగల్ సర్కిల్‌లో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించి టౌన్ ప్లానింగ్‌లో జరుగుతున్న అక్రమాలపై నిగ్గుతేల్లారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో సోదాలు నిర్వహించిన అవినీతి నిరోధక శాఖ అధికారులు టిపిఎస్‌తోపాటు పలువురు అధికారులు, సిబ్బంది అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారించారు.

### అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం: ఎసిబి శ్రీనివాస్

దుండిగల్ సర్కిల్ పరిధిలో అనుమతులు లేకుండా జరుగుతన్న అక్రమ నిర్మాణాలపై ఎసిపి శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. అనుమతులులేని నిర్మాణాలను పరిశీలిస్తున్నామన్నారు. నోటీసులు అందజేసి చర్యలు చేపడతామని తెలిపారు. అక్రమ నిర్మాణాలను ఉపేక్షించబోమని కఠిన చర్యలు తీసుకుంటామని ఎసిబి స్పష్టం చేశారు.

## అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాపక్షం/శామీర్‌పేట : అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరు అవగాహన కల్గి ఉండాలని అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ ధనుంజయ్ అన్నారు. గ్రేటర్ హైద్రాబాద్ పరిదిలోని శామీర్‌పేట డివిజన్ తూంకుంట విజన్ హైస్కూల్లో విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎడిఎఫ్ఒ ధనుంజయ్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు ఎలా జరుగుతాయి, వాటిని ఎలా నివారించాలి అనే విషయాలను ప్రత్యక్ష ప్రదర్శనల ద్వార (డెమోన్‌స్ట్రేషన్) నిర్వహించి అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమగ్రంగా వివరించారు. విద్యార్థులు ఆసక్తిగా ఈ ప్రదర్శనలను వీక్షించి అగ్ని భద్రతపై ముఖ్య విషయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శివప్రసాద్, లీడింగ్ ఫైర్ ఫైటర్ వంశీకృష్ణ, ఫైర్‌మెన్‌లు రవి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి కుట్రలను తిప్పికొట్టాలి

ప్రజాపక్షం /వికారాబాద్ : గ్రామీణ ప్రాంత శ్రామిక మహిళల ఉపాధిని దెబ్బతిసే బిజెపి మోదీ ప్రభుత్వం కుట్రలను తిప్పి కొట్టాలని ప్రగతిశీలి మహిళా సంఘం రాష్ట కార్యదర్శి వై.గీత పిలుపునిచ్చారు . అదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ మహిళ పోరాట దినంను, ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి వి–బి జీ రామ్ జీ పథకానికి వ్యతిరేకిస్తూ జిల్లా స్థాయి సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గీత మాట్లడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్, బిజెపి నాయకత్వాన ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రజలపై తమ పాసిస్టు దాడిని తీవ్రతరం చేయడమే కాకుండా కనీసం శ్రమ మీద ఆధారపడి జీవించాలేని పరిస్థితికి ప్రజలను నెట్టివేస్తుందని ,అందులో భాగమే మహత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రద్దుకు పూనకున్నదని ఆ నేపథ్యంలోనే ముందుకు వచ్చిన వి బి రామ్ జీ పథకమని ఈ పథకం అమలు మూలంగా దేశంలో ,తెలంగాణ రాష్టంలోని లక్షలాది మంది గ్రామీణ పేదలు, శ్రామిక మహిళలు ఉపాధిని కోల్పోతారని ఈ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు మహిళలు ముందుకు రావాలని కోరారు. నేడు మహిళల రక్షణ కోసమని చేపడుతున్ననిర్భయ, అభయ , దిశ ఎన్ని చట్టాలు వచ్చినా మహిళలు, పసిపిల్లటు, వృద్ధులు, ఉద్యోగులు, చివరికి ప్రాగణాపాయం నుంచి కాపాడే మహిళా డాక్టర్లపై గ్యాంగ్ రేప్‌లు ,మర్డర్‌లు జరుగుతుంటే పాలకులకు ఎంత మాత్రం సిగ్గని పించడంలేదని విమర్శించారు. కులం పేరుతో బడిలో, గుడిలో, దళితులను హత్యలు, స్థానం లేదని పసి పిల్లలను నెలకేసి కొట్టి చంపడం అనాగరిక కాలంలో కూడా జరిగి ఉండదని ,అగ్రవర్ణాలు పరువు హత్యలకు పాల్పడుతుంటే నివారణ చర్యలు లేవని అవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభావతి, పద్మమ్మ, సరిత,లక్ష్మి ,సనీత , పుష్పలత , తదితరులు పాల్గోన్నారు.

# హైదరాబాద్‌ను క్లీన్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్
- తుక్కుగూడలో కమిషనర్ ఆకస్మిక పర్యటన
- మహిళా కార్మికులకు 'విమెన్స్ డే' శుభాకాంక్షలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్‌ను సంపూర్ణ పరిశుభ్రమైన 'క్లీన్ సిటీ'గా మార్చడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆదివారం ఆయన తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో ఆకస్మిక తనిఖీలు జరిపారు. తుక్కుగూడ కూడలి, కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కమిషనర్, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిర్మాణ వ్యర్థాలు ఎక్కడా పేరుకుపోకుండా వెంటనే తొలగించాలని, పార్కులు, సరస్సులు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు అద్దంలా మెరవాలని ఆదేశించారు. అలాగే, మధ్యలో నిలిచిపోయిన సమీకృత మార్కెట్ నిర్మాణ పనుల పూర్తికి వెంటనే ప్రతిపాదనలు పంపాలన్నారు. పర్యటనలో భాగంగా మహిళా పారిశుద్ధ్య కార్మికులతో ముచ్చటించిన కమిషనర్, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వారికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలుపుతూ, నగరాన్ని శుభ్రంగా ఉంచడంలో వారి సేవలు వెలకట్టలేనివని కొనియాడారు.

### పారిశుద్ధ్య సమస్యలా ? వాట్సాప్ చేయండి

నగర పౌరులకు పారిశుద్ధ్య సేవలను మరింత చేరువ చేస్తూ జిహెచ్ఎంసి ఒక ప్రత్యేక వాట్సాప్ నెంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. రోడ్లపై చెత్త, నిండిపోయిన బిన్‌లు, మురుగునాలాల సమస్యలు వంటి పారిశుద్ధ్య ఫిర్యాదులను ఫొటో, లొకేషన్‌తో కలిపి 81259 66586 నెంబర్‌కు పంపించాలని కమిషనర్ కర్ణన్ తెలిపారు. ఈ విధానం ద్వారా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండానే సమస్యలకు తక్షణ పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఒక ప్రత్యేక వీడియోను జిహెచ్ఎంసి విడుదల చేసింది.

### జివిపి పాయింట్‌లకు జిహెచ్ఎంసి ప్రత్యేక కార్యాచరణ

నగరంలో ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు కనిపించే గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లను శాశ్వతంగా తొలగించేందుకు జిహెచ్ఎంసి నడుం బిగించింది. ఉదయం 9 గంటల లోపు చెత్త, నిర్మాణ వ్యర్థాలను తొలగించేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. ఇంటి వద్దే చెత్త సేకరించి నేరుగా వ్యర్థాల కేంద్రాలకు తరలించడంతో పాటు, గతంలో చెత్త వేసిన ప్రాంతాలను శుభ్రం చేసి అక్కడ ముగ్గులు వేస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. దోమల నియంత్రణకు ఫాగింగ్, యాంటీ లార్వా చర్యలను ముమ్మరం చేశారు. నగరం పరిశుభ్రంగా ఉండాలంటే అధికారులతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా అత్యవసరమని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

## గర్భాశాయ కేన్సర్ నివారణకు హెచ్‌పివి టీకా



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : బాలికల్లో గర్భాశాయ క్యాన్సర్‌ను నివారించటానికి హెచ్‌పివి టీకా అత్యంత ప్రభావవంతంగా ఉపయోగపడుతుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి తెలిపారు. ఆదివారం మల్కాజిగిరి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో బాలికల ఆరోగ్య రక్షణలో కీలకమైన హెచ్‌పివి టీకా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 సంవత్సరాల బాలికలు తప్పని సరిగా ఈ టీకాలు వేయించుకోవాలని, దీని కోసం తల్లిదండ్రులు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న డిఎంహెచ్ఓ డా.ఉమాగౌరి మాట్లాడుతూ హెచ్‌పివి టీకా కార్యక్రమం కేవలం ప్రభుత్వ వైద్యశాలల్లో మాత్రమే జరుగుతుందని, ప్రతి రోజు ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ టీకా కార్యక్రమం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ సదుపాయం కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, మేడ్చల్ సిహెచ్‌సి, ఘట్‌కేసర్ సిహెచ్‌సి కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.కౌశిక్ మాట్లాడుతూ తొలి రోజు జిల్లాలో 72 మందికి టీకా ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య విభాగానికి చెందిన వైద్యులు ప్రొఫెసర్ రాధ కిషన్, సాయి శోభ, శివకిరణ్, రాధ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలి



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న మహిళా సంక్షేమ పథకాలు, సహకార రుణాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని హెచ్‌బి కాలనీ మాజీ కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. ఆదివారం హుజురాబాద్ సాహితీ స్వచ్ఛంద సంస్త ఆధ్వర్యంలో హెచ్‌బి కాలనీ ఫేజ్ 1 గ్రౌండ్‌లో జరిగిన మహిళా దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ఎదిగి తమ సత్తా చూపించాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు కల్పించే అవకాశాలను వినియోగించుకోవాలన్నారరు. హుజురాబాద్ సంస్థ కుట్టు మిషన్, బ్యుటిషియన్ వంటి వృత్తి నైపుణ్యాలలో మహిళలకు శిక్షణ ఇస్తుండటం అభినందనీయమన్నారరు. పేదరికాన్ని పోగొట్టుకొని మహిళలు తమ కాళ్ల మీద తాము నిలబడేందుకు ఇలాంటి శిక్షణలు ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిథులు పల్లవి, నిత్యానంద్, మహిళా నేతలు హసీనా, ఉమ, రమ, సంపూర్ణ, వాణి, మమత, సౌమ్య, బిఆర్ఎస్ నేతలు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్ బోర్డు భూమికే ఎసరు

**అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటాం : తహసీల్దార్ ఎన్.రాజేశ్వర్‌రెడ్డి**



ప్రజాపక్షం / కుత్బుల్లాపూర్ : నగర శివారు ప్రాంతాల్లో భూముల రేట్లు ఆకాశాన్ని అంటుతుండడంతో కొందరు వ్యక్తులు వక్ఫ్ భూములు ప్రభుత్వ భూములు, ఇనామ్ భూములపై కన్నేశారు. కొందరి ఆర్థిక పరిస్థితులు ఆసరాగా చేసుకున్న కబ్జారాయిల్లు వక్ఫ్ భూములను కొట్టేసేందుకు పక్కా స్కెచ్ వేస్తున్నారు. ఈ క్రమంలో తక్కువ రేటుకు కొట్టేయడం, తప్పుడు పత్రాలు సృష్టించి అడ్డదారిలో రిజిస్ట్రేషన్స్ చేసుకోవడం నగర శివారు ప్రాంతాల్లో తరచు చోటు చేసుకుంటున్నాయి. నిజాంపేట్‌కు చెందిన ఓ మాజీ కార్పొరేటర్ అధికారులను మ్యానేజ్ చేస్తూ వక్ఫ్ భూములను కొట్టేసి అక్రమాలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బౌరంపేటకు చెందిన సుమారు 2ఎకరాల 7గుంటల భూమిని అడ్డదారిలో కాజేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్వే నంబర్ 663లో ఒక ఎకరా 30గుంటలు, సర్వే నంబర్ 664లో 0.24గుంటలు, సర్వే నంబర్ 665లో 0.37 గుంటలు, సర్వే నంబర్ 716లో 0.16గుంటలు 1989 ఫిబ్రవరి 16 వరకు వక్ఫ్ భూమిగా చూపుతుండగా ప్రస్తుత ప్రైవేట్ చేతుల్లోకి వెళ్లడం, దాని వెనక ఎవరెవరు ఉన్నారన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వక్ఫ్ బోర్డు, రెవెన్యూ అధికారులు ఇప్పటికైనా సర్వే నంబర్లపై దృష్టి పెట్టి వక్ఫ్ భూములను, ప్రభుత్వ భూములను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. బౌరంపేటలో కార్పొరేట్ పాఠశాలలు, ఖరీదైన విల్లాల నిర్మాణాలు నిర్మించడంతో పాటు, పక్కనే ఔటర్ రింగ్ రోడ్డు కావడంతో భూముల రేట్లు అమాంతం పెరిగాయి. అదునుగా కొందరు భూబకాసురులు ప్రభుత్వ భూములకు , వక్ఫ్ భూములపై కన్నేశారు. పాత రికార్డుల ప్రకారం వక్ఫ్ భూములుగా ఉండగా, రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్కారు భూమి, చెరువు భూమి చూపుతుంది. నకిలీ పత్రాలు సృష్టించి భూమి తమదిగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల భూమిని చదును చేసిన కబ్జాదారులు నిర్మాణాలు చేపట్టేందుకు అనువుగా మున్సిపల్ అధికారులను మ్యానేజ్ చేసి రోడ్డు నిర్మాణానికి తెరలేపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వక్ఫ్ బోర్డు, రెవెన్యూ అధికారుల సమన్వయలోపంతో వక్ఫ్ భూములు అన్యాక్రాంతం అవుతుండడం ఆందోళన కలిగించే విషయం. భూముల విలువ కోట్లల్లో ఉండడంతో ప్రణాళికబద్ధంగా భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

### వక్ఫ్ భూములని తేలితే చర్యలు తీసుకుంటాం : తహశీల్దార్ ఎన్.రాజేశ్వర్‌రెడ్డి

బౌరంపేట సర్వే నంబర్ 663, 664, 665, 716 వక్ఫ్ బోర్డు భూములు అన్యాక్రాంతంపై దుండిగల్, గండిమైసమ్మ మండల తహశీల్దార్ ఎన్.రాజేశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా.. వక్ఫ్ భూములు అన్యాక్రాంతం అయినట్లు పత్రికల ద్వారా మా దృష్టికి వచ్చిందన్నారు. వక్ఫ్ బోర్డు అధికారులకు సమాచారం అందించామని, వక్ఫ్ భూములు కాపాడాల్సిన బాధ్యత పూర్తిగా వక్ఫ్ బోర్డు అధికారులదేనని అన్నారు. జాయింట్ సర్వే కోసం ప్రతిపాదనలు పంపితే తప్పక చర్యలు తీసుకుంటామని అన్నారు.

## తహసీల్దార్ కార్యాలయంలో వాటర్ డిస్పెన్సర్

**సొంత నిధులతో ఏర్పాటు చేసిన తుంగతుర్తి రవి**

ప్రజాపక్షం/బోడుప్పల్ : వేసవి కాలం దృష్ట్యా కార్యాలయాలకు వచ్చే సామాన్య ప్రజల దాహార్తిని తీర్చడం కోసమే వాటర్ డిస్పెన్సర్ ఏర్పాటు చేసినట్లుగా పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆర్.వి. ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి తెలిపారు. మేడిపల్లి తహసీల్దార్ కార్యాలయంలో తుంగతుర్తి రవి తన సొంత నిధులతో వాటర్ డిస్పెన్సర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రవిని తహసీల్దార్ కృష్ణ చైతన్య అభినందించారు. అనంతరం తుంగతుర్తి రవి మాట్లాడుతూ, వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే సామాన్య ప్రజలు, వృద్ధులు మంచినీటి కోసం ఇబ్బంది పడకూడదనే ఉద్ధేశంతో ఈ నిర్ణయం తుసుకున్నామని తెలిపారు. ఈ వాటర్ డిస్పెన్సర్ ద్వారా కార్యాలయ సిబ్బందితో పాటు, పనుల నిమిత్తం వచ్చే సందర్శకులకు నిరంతరం చల్లని మంచినీరు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.ఆర్‌వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కృష్ణ చైతన్య, డిప్యూటీ తాహసిల్దార్ సైదిరెడ్డి, రెవిన్యూ ఇన్స్‌పెక్టర్లు ఆకుల చంద్రకళ, రాకేష్, హరీష్, మంద అరుణ తదితరులు పాల్గొన్నారు.



## 'మీ సమస్య' 'మా పరిష్కారం' కార్యక్రమం ప్రారంభం

**మాజీ ఎంఎల్‌సి కాటెపల్లి జనార్ధన్‌రెడ్డి**



ప్రజాపక్షం/శామీర్‌పేట : మీ సమస్య మా పరిష్కారం కార్యక్రమాన్ని మాజి ఎంఎల్‌సి కాటెపల్లి జన్దాన్ రెడ్డి ఆదివారం ప్రారంబించారు. మహిళా శక్తి మై వాయిస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎన్ హైమారెడ్డి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం పురస్కరించుకుని వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న మహిళలను గుర్తించి సన్మానించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామస్థాయిలోకి వెళ్లి మహిళా శక్తి మై వాయిస్ ఆధ్వర్యంలో పేద, మధ్య తరగతి, బడుగు బలహీన వర్గాల వారికున్న సమస్యలను తీర్చడానికి ఉద్దేశించి మీ సమస్య మా పరిష్కారం కార్యక్రమాన్ని రూపొందించామని చెప్పారు. అనంతరం గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ జి హేమలత, మున్సిపల్ కార్మికులు, హకింపేట బస్తీ దవాఖాన డాక్టర్ జోహేన, ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ అనితలను మహిళా శక్తి మై వాయిస్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎన్ హైమారెడ్డి ఘనంగా సన్మానించి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మాజి ఎంఎల్‌సి కాటెపల్లి జనార్దన్ రెడ్డి, మహిళా అదికారులు, మత్స్యశాఖ డైరక్టర్ రాము, తదితరులు పాల్గొన్నారు.

## కేశ్వాపూర్‌ను అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతాం



ప్రజాపక్షం/శామీర్‌పేట : పారిశుద్ధ్య నిర్వాహణలో కేశ్వాపూర్‌లోని రెండు వార్డులను అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతామని మూడుచింతలపల్లి మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్ అన్నారు. ఆదివారం మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని కేశ్వాపూర్‌లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో బాగంగా మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు చెత్తను ఊడ్చి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టబోయే 99 రోజుల ప్రజాపాలన పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా మున్సిపల్‌లోని అన్ని వార్డులను శుభ్రం చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు దోసకాయల లత, పెద్దిరెడ్డి, శ్రీలత, రాజిగళ్ల లత, గోవర్ధన్‌రెడ్డిలు పాల్గొని అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పారిశుద్య కార్మికులను ఘనంగా సన్మానించారు.



## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన చైర్ పర్సన్ శిరీషారెడ్డి

ప్రజాపక్షం/శామీర్‌పేట: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమటం శిరీషా కృష్ణారెడ్డి ఓ వివాహ వేడుకలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం నగరంలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఆన్యా కన్వెన్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సూరం అనిల్‌రెడ్డి కుమారుడి వేడుకలకు సిఎం రేవంత్‌రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమటం శిరీషా సిఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గొనె మహేందర్‌రెడ్డి, కౌన్సిలర్ ముద్దం సుధాకర్‌రెడ్డి, ఇతర నాయకులు ఉన్నారు.

## స్త్రీ లేకపోతే జననం లేదు



ప్రజాపక్షం/ కుత్బుల్లాపూర్ : స్త్రీ లేకపోతే జననం లేదు, స్త్రీ లేకపోతే గమనం లేదు, స్త్రీ లేకపోతే సృష్టిలో జీవంలేదు అని నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ అన్నారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కెటిఆర్ కాలనీ నందు 150మంది శానిటేషన్ మహిళా కార్మికులను సన్మానించి, వారికి చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ 11వ డివిజన్ రవికిరణ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు బొబ్బ శ్రీనివాస్, ప్రదీప్ , కెటిఆర్ కాలనీ అధ్యక్షులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన కెటిఆర్

ప్రజాపక్షం/చర్లపల్లి : రాష్ట్ర మాజీ మంత్రి,మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి 50వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా నియోజకవర్గంలోని రాంపల్లి దాయరాలోని స్టాఫ్స్ క్రికెట్ స్టేడియంలో సిఎంఆర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి,బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు హాజరై టాస్ వేసి క్రికెట్ పోటీలను ప్రారంభించారు.ఈ పోటీల్లో విజేతగా నిలిచిన జట్టుకు లక్ష,రన్నరప్‌కు 50 వేల నగదును అందజేయనున్నారు.మల్లారెడ్డి బౌలింగ్ వేయగా కెటీఆర్ బ్యాటింగ్ చేసి సరదాగా క్రికెట్ ఆడారు.అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా మహిళకు శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు,నూతన కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళ దినోత్సవం



ప్రజాపక్షం /వికారాబాద్ : అంతర్జాతీయ మహిళ దినోత్సవం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఇమ్మానుయేల్ ఏజీ చర్జిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగామహిళలు మాట్లాడుతూ విద్య ద్వారానే మహిళలు ముందుకు వెళ్తర్నారు. ప్రతి మహిళ తన కళ్లపై తను నిలబడేటట్లు ఉండలని కోరారు మహిళలు పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారని అన్నారు. ట్రైన్ నుండి విమనం వరకు , మహిళ ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. మహిళ లేనిదే ప్రపచం లేదని అన్నారు. మహిళలను గౌరవించడం మనందరి బాధ్యత అన్నారు. ప్రతి మహిళ ఉన్నత స్థాయిలో ఉండలని కోరారు.ఈ కార్యక్రమంలో ఫాస్టర్ ఎలీయాజర్, సలోమి ,కరుణ , ఎస్తేరు ,మంజుల పెద్ద ఎత్తున పాల్గోన్నారు.

## మహిళ పోలీసులకు సన్మానం



ప్రజాపక్ష / కుల్కచర్ల : అంతర్జాతీయ మహిళా దినో త్సవం సందర్భంగాకుల్కచర్ల పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళ పోలీసులను ఎస్ఐ రామేష్‌కుమార్ ఘనంగా సన్మానించిన ఈ కార్యక్రమంలో మెహజబీన్ ,మహదేవి .శ్రీలత , ,రమేశ్వరి లను పూలమాలలు ,శాలువాలతో సత్కరించి అభినందించారు. విధి నిర్వహణలో వారు చూపుతున్న క్రమశిక్షణ సేవాభావం ,ప్రజల పట్ల బాధ్యతను ఎస్ఐ ప్రత్యేకంగా కొనియాడారు.

### వికారాబాద్ జిల్లా కేంద్రంలో

అంతర్జాతీయ మహిళ దినోత్సవం వికారాబాద్ జిల్లా కేంద్రంలో వికారాబాద్ జిల్లా ఎస్‌పి సూచనల మేరకు వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ అనన్యను తోటి మహిళ కౌన్సిలర్లతో పాటు మహిళ పోలీస్‌లకు ,300మంది విద్యార్థులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సిఐ రాఘుకుమార్ ఘనంగా సన్మానించారు.



## రోడ్డు భద్రత మెరుగే లక్ష్యం

రెండు రోజుల్లో 445 మందుబాబుల అరెస్ట్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రోడ్డు భద్రతను మెరుగుపరిచే లక్ష్యంతో హైద రాబాద్ ట్రాఫిక్ పోలీసులు మార్చి 6, 7 తేదీల్లో (రెండు రోజుల పాటు) మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా మొత్తం 445 మంది వాహనదారులు మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిలో 377 మంది ద్విచక్ర వాహనదారులు, 22 మంది త్రీవీలర్ (ఆటో) డ్రైవర్లు, 46 మంది ఫోర్ వీలర్ లేదా ఇతర భారీ వాహన చోదకులు ఉన్నారు. మద్యం స్థాయిలు (బి ఎసి లెవెల్), నమోదైన కేసులు: 30 నుంచి 50 (100) కేసులు, 51 నుంచి 100 (191) కేసులు, 101 నుంచి 150 (84) కేసులు, 151 నుంచి 200 (39) కేసులు, 201 నుంచి 250 (12) కేసులు, 251 నుంచి 300 (09) కేసులు, 300 పైనా (10) కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే విషయంలో ఎట్టి పరిస్థితు ల్లోనూ ఉపేక్షించేది లేదని, ఈ ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతా యని పోలీసులు స్పష్టం చేశారు. ప్రయాణికులందరూ హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు.

## 78 మద్యం బాటిళ్ల పట్టివేత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ సమీపంలోని పహాడీ షరీఫ్ ప్రాంతంలో ఎక్సైజ్ శాఖ నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో 78 మద్యం బాటి ళ్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌టీఎఫ్ బి టీం, మీర్పేట్ ఎక్సై జ్ స్టేషన్ అధికారులు సంయుక్తంగా ఎయిర్‌పోర్ట్ సమీపంలోని పహాడ్ షరీఫ్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా ఉన్న వాహనాలను పరిశీలించగా 78 మద్యం బాటిళ్లు బయటపడ్డాయి.పట్టుబ డిన మద్యం బాటిళ్లు ఢిల్లీ, గోవా ప్రాంతాలకు చెందినవిగా అధికారులు గుర్తించారు. ఘటనపై ఆరుగురిపై కేసు నమోదు చేసిన ఎక్సైజ్ అధికా రులు, స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను మీర్పేట్ ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై మరింత దర్యాప్తు కొనసాగుతోందని అధికా రులు తెలిపారు.

## మహిళా పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమూల్యం : జిహెచ్‌ఎంసి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగర పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్న మహిళా పారిశుద్ధ్య కార్మికులను జిహెచ్‌ఎంసి ఘనంగా సత్కరించింది. స్వచ్ఛ భారత్ మిషన్ (అర్బన్)లో భాగంగా నారీ లెడ్ స్వచ్ఛత కార్యక్ర మాన్ని యూసుఫ్‌గూడ సర్కిల్‌లోని జయ ప్రకాశ్ నగర్‌లో ఆదివారం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో పరిశుభ్రత బలోపేతానికి కృషి చేస్తున్న మహిళా పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక మహిళలను అధికారులు అభినం దించి సత్కరించారు. నగరాన్ని శుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచడంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని అధికారులు అన్నారు. నగర పారిశుద్ధ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో, పరిశుభ్రతపై అవగాహన కల్పించ డంలో మహిళా కార్మికుల సేవలు ఎనలేనివని జిహెచ్‌ఎంసి తెలిపింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా పారిశుద్ధ్య కార్మికులను అభినందిస్తూ జిహెచ్‌ఎంసి తన అధికారిక ఖాతాలో ప్రత్యే కంగా పేర్కొంది.

## 'గర్భాశయ క్యాన్సర్ పట్ల అవగాహన అవసరం' : వైద్యులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గర్భాశయ క్యాన్సర్‌ను ముందస్తుగానే గుర్తిస్తే పూర్తిగా నివారించేందుకు అవకాశాలు ఉంటాయని ప్రముఖ వైద్యులు సూచించారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించవచ్చన్నారు. అంతర్జా తీయ మహిళా దినోత్సవం సందర్భంగా రెనోవా హాస్పిటల్ సనత్‌నగర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో 'బీఫోర్ క్యాన్సర్ స్ట్రైక్స్, స్క్రీనింగ్ విన్నర్స్' అనే అంశం పైన మహిళల్లో క్యాన్సర్ నివారణ పట్ల ఆదివారం అవగాహన కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసూతి, గైనకాలజీ నిపుణురాలు డాక్టర్ పి.ఫరీదా మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్ మహిళల్లో సాధార ణంగా కనిపించే వ్యాధులలో ఒకటని, ఇందుకు ముందస్తు పరీక్షలు చేయించుకోవడం ద్వారా దీన్ని ప్రారంభ దశలోనే గుర్తించవచ్చన్నారు. ఆంకాలజిస్ట్ డాక్టర్ జి.వాసు బాబు మాట్లాడుతూ భారతదేశంలో మహి ళల్లో గర్భాశయ క్యాన్సర్ కేసులు గణనీయంగా నమోదవుతున్నాయ న్నారు. సరైన అవగాహన, స్క్రీనింగ్ పరీక్షలు, సమయానికి చికిత్స అందడం ద్వారా దీనిని నియంత్రించవచ్చని వివరించారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



**ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం :** మహిళలు అన్ని రంగా లలో రాణించాలని గ్రామ సర్పంచ్ సామ అశ్విని రెడ్డి పిలుపునిం చారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తులేకలాన్ గ్రామంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఆమె ముఖ్య అతిథులుగా హజరై గ్రామంలో వివిధ రంగాలలో అభివృద్ధి చెందిన మహి ళలను ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ మహిళలు వివిధ రంగాలలో నైపుణ్యం చెంది ఆర్థికంగా అభివృద్ధి చెందా లని సూచించారు. అంతర్జాతీయ స్థాయిలో బాస్కెట్ బాల్ క్రీడల్లో ఎంపికైన విద్యార్థినిని ప్రసంశించి అభినందించారు. కార్యక్రమంలో కార్యదర్శి మల్లేష్, ఉప సర్పంచ్ డి జగదిష్, మహీళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మహిళలపై హింసకు మద్యపానమే ప్రధాన కారణం

హైకోర్టు న్యాయవాది శారద

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్ర చారీ




**ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్‌మెట్ :** దేశం సాంకేతికంగా ముందుకు పోతున్న తరుణంలో కూడా మహిళలలు హత్యలకి అత్యాచారాలకి గురికా వటానికి పురుషాధిపత్య భావజాలంతో పాటు మద్యపానం కూడా ప్రధాన మైన కారణం అని అందుకే దాన్ని పూర్తిగా రద్దు చేయాలని హై కోర్టు ప్రముఖ న్యాయవాది శారదా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ అన్నారు. మార్చ్ 08 అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాటం దినం సందర్భంగా ఆదివారం రావి నారాయణ రెడ్డి కాలనీ ఫేజ్ 2 సిపిఐ పార్టీ కార్యాలయంలో భారత జాతీయ మహిళా సమాఖ్య అబ్దుల్లా పూర్‌మెట్ మండల సమితి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షురాలు కాటి అరుణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైకోర్టు న్యాయ వాది శారదా మరియు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1910 కోపెన్ హేగ్ లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో మహిళా నాయకురాలు క్లారా జెట్కిన్ ప్రతిపదించిన ఈ మహిళా దినం వెనుక అనేక మంది మహిళల పోరాటాలు ప్రాణ త్యాగాలు ఉన్నాయని అన్నారు. చదువు, జ్ఞానం సాంకే తికత ఉన్న ప్రస్తుత సమాజంలో కూడా ప్రతి పదిహేను నిమిషాలకి ఒక సారి మహిళా దాడి జరుగుతుంది. మహిళలపైన హింస హత్యలు అత్యాచా రాలు జరగటానికి నేడు ప్రధానమైన కారణం మద్యపానం అని తాగిన మత్తులో ఏం చేస్తున్నారో కూడా తెలియని స్థితికి మద్యం తీసుకుపోతుం దని అన్నారు. ప్రభుత్వాలు మద్యం ద్వారా పాన్ మసాలాల గుట్కాల ద్వారా కోట్ల రూపాయలు సంపాదించుకోవటమే లక్ష్యంగా పని చేస్తున్నా యని మహిళలకు రక్షణ కరువై వారి ప్రాణాలకి ఏ మాత్రం విలువ లేకుండా చేస్తూ మధ్యాన్ని గుట్కాలని విచ్చల విడిగా అందుబాటులోకి తీసుకొచ్చాయాని మండిపడ్డారు ఈ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వలకి మహిళల పట్ల చిత్త శుద్ధి ఉన్న తక్షణమే మద్యపానం పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పితృ స్వామ్య సమాజంలో పురుషులు మహిళలని కేవలం వంట ఇంటికి పరిమితం చేస్తున్నారని పిల్లలను కనే యంత్రంలాగే చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దేశ మొదటి పౌరురాలు రాష్ట్ర పతి ద్రౌపది మూర్ము ఒక మహిళా అని గుర్తు చేశారు. రాజకీయ, సామ జిక, ఉద్యోగ, వ్యాపార ఇలా అనేక రంగాల్లో మహిళలు రాణించాలని, మహిళల తమ హక్కుల సాధన కొరకు మహిళలపైన హింసకి వ్యతిరేకంగా చట్ట పరిధిలో పోరాటాలు చేయాలను ఇప్పటికే ఉన్నటువంటి నిర్భయ చట్టం, ఆస్తి హక్కు చట్టం, లింగ నిర్ధారణ పరీక్షల నిరోధక చట్టాలపై సరైన అవగాహనా కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి,ప్రజా నాట్య మండల రాష్ట్ర కార్యదర్శి పల్లె నర్సింహా, సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల ప్రధాన కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్, సహాయ కార్యదర్శి కేతారాజు నర్సింహా, చిర శేఖర్, గణేష్, పల్లె జ్యోతి, దేవమ్మ, అనూష, సుజాత తదితరులు పాల్గొ న్నారు.

# అందరికీ అందుబాటులో ఉంటా



ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**ప్రజాపక్షం/హాయత్ నగర్:** నియోజకవర్గ అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఎల్.బి.నగర్ శాసనస భ్యులు సుధీర్ రెడ్డి అన్నారు శనివారం నాడు చంపాపేట డివిజన్ పరిధి లోని పద్మనగర్, న్యూ పద్మనగర్ కాలనీల నందు స్థానిక నాయకులు,అధి కారులచే కలిసి పర్యటించి పలు సమస్యలను తెలుసుకున్నారు. చుట్టుప క్కల కాలనీవాసులు ఉదయ్ నగర్, సామ సరస్వతి కాలనీ, క్రాంతి నగర్, ఏం.ఆర్.ఆర్.కాలనీ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో చిన్నపాటి వర్షానికి చుట్టుపక్కల కాలనీలు జలమ యమయ్యేవి అని గుర్తు చేశారు. మళ్ళీ అలాంటి పరిస్థితులు రావొద్దని దూరద్రుష్టితో ఆలోచించి ఎన్ని ఆటంకాలు వచ్చిన ఎస్.ఎన్.డీ.పీ.పనుల్లో భాగంగా బాక్స్ డ్రైన్స్, ట్రంక్ లైన్స్ నిర్మించి వరదనీటి సమస్యల నుంచి విముక్తి కలిగించడం జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బం దులు లేవని తెలిపారు. దాదాపు 95శాతం బాక్స్ డ్రైన్స్ పనులు పూర్తి కావడం జరిగింది అని, అతి త్వరలోనే పూర్తి స్థాయిలో పనులు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇట్టి పనులు సకాలంలో పూర్తి అయిన తర్వాత మిగిలిపోయిన ప్రదేశంలో సీసీ రోడ్లు వేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. అలాగే కొన్ని కాలనీల నందు సీ.సీ. కెమెరాలు, డ్రైన్స్ తదితర పనులు చేయాలని కోరిన నేపథ్యంలో దశలవారీగా పనులు పూర్తి చేస్తా మని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ అధికారులు శ్రీని వాస్, భవ్య, ఎలక్ట్రిసిటీ అధికారులు శ్రీనివాస్, నాయకులు సుంకోజు కృష్ణ మాచారి, ఓరుగంటి వెంకటేష్, డివిజన్ అధ్యక్షులు రాజిరెడ్డి, చీర శ్రీనివాస్ ,రవిముదిరాజ్, గండికోట శ్రీనాద్, సదానంద్ రెడ్డి, మల్లేష్ గౌడ్, ఉమ మహేశ్వర్, చలమల యాదిరెడ్డి,సత్తి రెడ్డి ,బొంబాయి ,సురేందర్ రెడ్డి, రాజశేఖర్, రమాదేవి, కల్పన చుట్టుప్రక్కల కాలనీవాసులు జయవర్ధన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, అల్లంపల్లి శ్రీనివాస్, శ్రావణ్ కుమార్ రెడ్డి,అమరేందర్ సాగర్, అనంతరెడ్డి, నర్సింహా ముదిరాజ్, మహిపాల్ రెడ్డి, ఆనంద్, దివా కర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రక్తదాన శిబిరం

ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించు కొని శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు కట్ల చంద్రశేఖర్ రెడ్డి, మాదాపూ ర్‌లోని సింధూ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో చందానగర్‌లోని సరస్వతి విద్యా మందిర్ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం, రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ సీనియర్ నాయకులు కట్ల చంద్రశే ఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉచిత వైద్య శిబిరం, రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మహిళలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకొవాలని సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం ఆరోగ్యాంగా ఉంటాయన్నారు. అదే విధంగా రక్తదాన శిబిరం ద్వార సేకరించిన రక్తాన్ని మాదాపూర్‌లోని సింధు ఆసుపత్రి వారికి అందించారు. రక్తదానం చేయడం ఒక గొప్ప సేవ అని రక్తదానం అందించిన వారిని కాంగ్రెస్ సీని యర్ నాయకులు కట్ల చంద్రశేఖర్ రెడ్డి కొనియాడారు. మహిళల ఆరో గ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో సింధూ ఆసు పత్రి అనుభవజ్ఞులైన వైద్యులు మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందించారని తెలిపారు. ముఖ్యంగా మహి ళలలో ఎక్కువగా కనిపించే వ్యాధులు రక్తహీనత, శరీర రోగ నిరోధక శక్తి, గ్రాన్స్‌మిట్ అయ్యే వ్యాధులపై డాక్టర్లు మహిళలకు అవగాహన కల్పించా రని తెలిపారు. తదుపరి నిర్వహించిన రక్తదాన శిబిరంలో పెద్ద సంఖ్యలో పలువురు యువకులు, మహిళలు ముందుకు వచ్చి రక్తదానం చేశారు. కార్యక్రమంలో మాదాపూర్‌లోని సింధూ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, స్థానిక నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు ఆర్థిక స్వావలంబనే మార్గం




సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగరావు

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** మహిళలకు కేవలం చదువు మాత్రమే సరిపోదని, ఆర్థిక శక్తి తోడైనప్పుడే నిజమైన మహిళా సాధికారత సాధ్యమవుతుందని సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాలు నర్సింగ్ రావు మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి అన్నారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినో త్సవం సందర్భంగా సిపిఐ రాజేంద్రనగర్ కార్యాలయం దేవరాజ్ భవన్ లో భారత జాతీయ మహిళా సమాఖ్య రాజేంద్రనగర్ మండల అధ్యక్షు రాలు మునేశ్వరి ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాలు నర్సింగ్ రావు మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసం గించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు కేవలం చదువు మాత్రమే సరిపోదని, ఆర్థిక శక్తి తోడైనప్పుడే నిజమైన మహిళా సాధికారత సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.మహిళల పట్ల వివక్ష ఇంకా కొనసాగుతూనే ఉందన్నారు. అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్న ప్పటికీ, సమాజంలో నేటికీ వివక్ష, వేధింపులు కొనసాగడం దురదృష్టకర మని, సంపన్న కుటుంబాల్లోని మహిళలు సైతం వీటికి బాధితులు అవుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు తమ హక్కుల కోసం నిలబడా లంటే ఆర్థికంగా ఎదగడం అవసరము అని పిలుపునిచ్చారు. అనంతరం సీనియర్ మహిళా నాయకులు సత్యమ్మ, పుష్ప, శాంతమ్మ, మణెమ్మ, యశోద, శైలజలను భారత జాతీయ మహిళా సమైక్య మండల అధ్యక్షు రాలు మునేశ్వరి మండల ఉపాధ్యక్షురాలు కుక్కునూరు వాణి బుజ్జి ఊర్మిళ ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంఏ రియాజ్ జిల్లా సమితి సభ్యులు జే.ఆనంద్ గౌడ్, మండల సహాయ కార్యదర్శి విజయ ఆనంద్ గౌడ్, మండల కార్యాలయం కార్యదర్శి జి సత్యం, మండల కౌన్సిల్ సభ్యులు సదానంద గౌడ్, పాండు, కృష్ణ, శీను, నాగరాజు, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా హెచ్‌పివి వ్యాక్సిన్

14 ఏళ్లు నిండిన ఆడపిల్లలందరికీ ఉచితంగా హెచ్‌పివి వ్యాక్సిన్

రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.లలితా దేవి



**ప్రజాపక్షం/రంగారెడ్డి :** 14 సంవత్సరాలు నిండిన ఆడపిల్లల అందరికీ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా హెచ్‌పివి వ్యాక్సిన్ వేయడం జరుగుతుందని రంగా రెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.లలితా దేవి అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా రాజేంద్ర నగర్ సిఎస్‌సిలో ఏర్పాటు చేసిన హెచ్‌పివి వ్యాక్సిన్ సెంటర్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.లలితాదేవి ముఖ్య అతిథిగా లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్‌పివి వ్యాక్సిన్ గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం 14 సంవత్సరాలు నిండిన ప్రతి ఆడపిల్లలు అందరికీ కూడా ప్రభుత్వ ఆసుప త్రుల్లో ఉచితంగా మార్చి 8 నుంచి ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. హెచ్‌పివి వ్యాక్సిన్ సెంటర్‌లను షాద్‌నగర్ సిఎస్సి, కొండాపూర్ ఏరియా హాస్పిటల్, వనస్థలిపురంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ రాజంనగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్, మహేశ్వరంలోని కమిటీ హెల్త్ సెంటర్, హయత్‌నగర్‌లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్, శంషాబాద్‌లో ఉచితంగా ఇవ్వబడం జరుగుతుందన డిఎంహెచ్ లలితా దేవి పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో డిస్ట్రిక్ట్ ఎమినైజేషన్ డాక్టర్ శివ హయత్, రాజేంద్రనగర్ డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ విజయ పూర్ణిమ పాల్గొన్నారు.

## మహిళలు నేడు అన్నిరంగాల్లో ముందుండి పనిచేస్తున్నారు



**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అంబెద్కరు యువజన సంఘం అధ్య ర్యంలో నిర్వహించారు. గ్రామ సర్పంచ్ విజయ్‌కుమార్, విహెచ్‌పియస్ రాష్ట్ర అధ్యక్షులు కాళ్ళ జంగయ్యలు మాట్లాడుతూ మహిళలు నేడు అన్నిరంగాల్లో ముందుండి పనిచేస్తున్నారని తెలిపారు. రాజకీయంగా ఆర్థికంగా సామాజి కంగా అన్నిరంగాల్లో ముందుకు సాగాలన్నారు. మహిళలలను చిన్నచూపుచూ డడం సరైందికాదు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.



మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో అంతర్జాతీయ మహిళ దినో త్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. యాచారం సిఐ నందిశ్వర్‌రెడ్డి అధ్వర్యం లో ఎస్‌ఐ ప్రియాంక పోలీసులకు శాలువా కప్పారు. అన్ని రంగాల్లో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ మధు, ఎస్‌ఐ ప్రియాంక పోలిస్‌ఇబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామంలో ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరల నిరసనగా వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పి.అంజయ్య మాట్లాడుతూ ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలపై దాడులు రోజు రోజుకు పెరుగుతున్నాయని అన్నారు. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వంలో మహిళలపై దాడులు పెరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఉద్యమించా ల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి నరేశ్, అంజయ్య, గోవర్ధన్, నందు, మల్లేశ్, సావిత్రి, మహేందర్, హంసమ్మ, బాలమ్మ అండాలు తదితరులు పాల్గొన్నారు.

## చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి: కొప్పుల సరిత




**ప్రజాపక్షం/హయత్‌నగర్ :** చట్టసభలలో 44శాతం రిజర్వేషన్లకై ఉద్యమిస్తాం కొప్పుల సరిత 115 వ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)హయత్ నగర్ మండల పార్టీ కార్యాలయంలో మహిళా సమైక్య అధ్యక్షురాలు కర్నే సుజాత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా మహిళా సమైక్య మండల ప్రధాన కార్యదర్శి కొప్పుల సరిత విచ్చేసి మహిళా సమైక్య జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ... కుటుంబంలో, సమాజంలో మహి ళలపై జరుగుతున్న వివక్ష, హింసకు వ్యతిరేకంగా పోరాటం చేయాలి. గ్రామీణ మరియు పట్టణం మహిళలకు వారి హక్కుల గురించి (విద్య, ఆస్తిహక్కు, చట్ట పరమైన రక్ష) తెలియజేయాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో అరుణ, పారి జాత, అనిత, భాగ్య, ఆదిలక్ష్మి, శివ జ్యోతి, పద్మ, శిల్ప, రాధ, సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి ఏశమల్ల మమతతో పాటు భారీగా మహిళలు పాల్గొన్నారు.

## ప్రగతి ప్రణాళిక సమర్థవంతంగా అమలు చేయాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్ర మాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారా యణ రెడ్డి సంబంధిత అధికారు లను ఆదేశించారు. ఆదివారం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలుపై సంబంధిత అధికారు లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మార్చి 6 నుంచి జూన్ 12వ తేదీ వరకు వరకు 99 రోజుల పాటు చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను గ్రామస్థాయి, మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయిలలో అమలు చేయాలని, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో పారి శుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించడం, ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్ల క్లియరెన్స్, ఆరోగ్యం, అరైవ్ అలైవ్, సంక్షేమం, పిల్లలు భద్రత, వ్యవ సాయం, విద్య, యువత, మహిళలు, పర్యావరణం తదితర అంశాలపై సంబం ధిత శాఖల అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి దశల వారీగా పూర్తి చేసి ఉగాది పండుగ రోజున ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో చేప ట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పనులను చూసి జిల్లాలో చాలా బాగా అమలు చేశారన్న పేరు వచ్చే విధంగా మనందరం పని చేయాలని అన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి, శ్రీనివాస్, డిఆర్ఓ సంగీత, జెడ్పి సిఇఓ కృష్ణారెడ్డి, ఆర్డీవోలు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, తహశీల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

